# లైనీ

ప్రతీ ఆదివారం హైద్రాబాద్‌లోని అబిడ్స్‌లో పేవ్‌మెంట్ల మీద పాత పుస్తకాలమ్మే దుకాణాలు వెలుస్తుంటాయి. నాలాంటి పుస్తకప్రియు లంతా తీరిక దొరికితే అక్కడ పుస్తకాలవేట సాగిస్తూంటారు.

ఆ ఆదివారం పేవ్‌మెంటుమీద పరిచిన పుస్తకాలని తీసుకుంటూ నడుస్తుంటే ఓ దుకాణం యజమాని పలకరించాడు హిందీలో.

"కైసేహై సాబ్ ?"

"ఠీక్‌హై" సమాధానం చెప్పాను. కొన్ని సంవత్సరాలుగా నా మొహం అతనికి పరిచయం కాబట్టి పలకరించాడు.

"మీకో కుక్కపిల్ల కావాలా ?" అడిగాడు.

"కుక్కపిల్లా ?" అడిగాను ఆశ్చర్యంగా.

"అవును సాబ్ మేలుజాతి కుక్కపిల్ల."

"అవసరంలేదు." చెప్పాను.

"క్రితంసారి మీరు కుక్కల పెంపకం గురించిన పుస్తకం కొను క్కెళ్ళారు కదా. మీకు కుక్కలంటే ఇంట్రస్ట్ అనుకున్నాను." చెప్పాడు.

ఆ పుస్తకం కొనడానికి కారణం, అందులో కుక్కలకి సంబం ధించిన వివరాలుండటమే. నే రాయబోయే ఓ నవల్లో ఉపయోగించడానికి దాన్ని కొన్నాను. అది కొని అప్పుడే ఆరునెలలు దాటింది. ఇతనికి ఎంత గుర్తు ?

"నా దగ్గర చాలా మంచి కుక్క ఉంది సార్. ఇలాంటిది" లైఫ్ పత్రికలోని కుక్క బిస్కట్లు ప్రకటనలోని ఓ కుక్క బొమ్మని చూపించాడు.

పమేరియన్ !

"ఎక్కడిది ?" అడిగాను.

డబ్బున్నవాళ్ళు సరదాకోసం పెంచుకొనే ఆ పెట్ డాగ్-రోడ్డు మీద పాత పుస్తకాలమ్ముకునే అతనికి ఎలా వచ్చిందో తెలుసుకోవాలని అడిగాను.

"నా స్నేహితుడు ఇచ్చాడు సార్. మీకు తోచింది ఇవ్వండి చాలు."

లేచి వెళ్ళి రెండు నిమిషాల్లో ఆ కుక్కని తీసుకువచ్చాడు.

తెల్లటిబొచ్చు, నల్లటి మెడ ఎంతో అందంగా వుంది. మూడు కిలోలు కూడా వుండకపోవచ్చు.

"వద్దు" చెప్పాను.

"ఎంత ఇస్తారు ? అడిగాడు.

"అవసరంలేదు."

"ఏభై ఇవ్వండి చాలు."

"నాకు కుక్కలు పెంచే అలవాటులేదు." చెప్పాను.

నేను చాలాకాలంగా వెదుకుతున్న పుస్తకం, అణుశక్తికి సంబంధించింది కనపడింది. దాన్ని కొన్నాను. వెళ్తుంటే అడిగారు వాళ్ళు.

"వద్దాసార్ ఈ కుక్కపిల్ల ?"

"వద్దు."

"ఆఖరి బేరం పాతిక ఇవ్వండి చాలు."

చాలాకాలం క్రితం ఇంట్లో ఓ కుక్క వుంటే బావుండునని నా స్నేహితుడు సుమన్ అన్నమాటలు గుర్తొచ్చాయి. మారు మాట్లాడకుండా పాతిక రూపాయలిచ్చి దాన్ని కొన్నాను.

ఆటోలో సరాసరి సుమన్ ఇంటికి వెళ్ళాను.

"ఇదేమిటి ?" అడిగింది తలుపు తీసిన సుమన్ భార్య కుక్కని చూడగానే.

"ముందర ఆటో ఫేర్ ఇవ్వండి తర్వాత చెప్తాను" నవ్వుతూ చెప్పాను.

ఆటోవాడిని పంపించాక జరిగింది చెప్పాను.

"మంచి పనిచేసావ్ ఇది పమేరియన్ హండ్రెడ్ పర్సెంట్ ప్యూర్" చెప్పాడు సుమన్ పరీక్షించి

"నచ్చిందా ?" అడిగాను.

"నచ్చడమేమిటి. మళ్ళీ నువ్వడిగినా యిచ్చేది లేదు."

ఆ పమేరియన్ ఓమూల నిశ్శబ్దంగా నిలబడి మమ్మల్ని చూస్తోంది.

"కమాన్ కమాన్" సుమన్ భార్య చేతులూపి పిలిచింది.

అది కదల్లేదు. అలాగే చూస్తోంది.

"దీని పేరేమిటి ?" అడిగింది నన్ను.

"పేరా ? ఏమో తెలీదు" చెప్పాను.

"దీని వయసు నాలుగు సంవత్సరాలుంటుంది. ఇదివరకటి ఓనర్స్ ఏదో ఓ పేరు పెట్టి వుంటాలి" చెప్పాడు సుమన్.

"కనుక్కుంటాను" చెప్పాను.

"మీరు కనుక్కొని వచ్చి చెప్పేదాకా నేనే దానికి టెంపరర్లీగా ఓ పేరు పెడ్తాను" చెప్పింది సుమన్ భార్య.

"ఏం పేరు ?" అడిగాడు సుమన్.

"జూలీ !" సూచించాను.

"జూలీ, జూలీ చాలా పాత పేరు."

"రాము ! ?"

"ఛీ, కుక్కకి దేముడి పేరేమిటి ?" చెప్పాడు సుమన్.

సుమన్ భార్య కాసేపు ఆలోచించి చెప్పింది.

"చాలా చిన్నది కాబట్టి షైనీ అని పిలుద్దాం."

"షైనీ బావుంది" చెప్పాడు సుమన్.

"షైనీ-కమాన్" పిలిచింది సుమన్ భార్య."

అది కదల్లేదు అలాగే చూస్తూ కూర్చొంది.

* * *

బయల్దేరేముందు అతనుండే పఫిల్‌గూడాలో స్థలాలేమైనా వుంటే కొనే వుద్దేశంలో వున్నానని, కనుక్కొని చెప్పమని ఆదివారం కోరాను. ఆ విషయం కనుక్కోడానికి ఫోన్ చేసాను రెండురోజుల తరువాత.

ఇంకా కనుక్కోలేదని చెప్పాడు.

"ఎలా వుంది మీ షైనీ ?" అడిగాను.

"ఇంతదాకా అన్నం ముట్టలేదు. పాలు కూడా తాగడం లేదు కనీసం" చెప్పాడు.

"అదేం ?" అడిగాను.

"అకస్మాత్తుగా పాత యజమానిని మర్చిపోవలసి వస్తుందిగా అడ్జెస్టు అయ్యేదాకా తప్పదు. మాదగ్గరకే రావడంలేదు." చెప్పాడు.

"జాగ్రత్తగా చూసుకోండి. అదిలా నిరాహార దీక్ష. చేస్తే చచ్చిపోగలదు కూడా" హెచ్చరించాను.

మరో రెండు రోజులు గడిచాయి. కళాభవన్‌లోని హేండీక్రాఫ్ట్స ఎగ్జిబిషన్ హౌస్‌నుంచి ఇంటికి వెళ్ళేసరికి ఎనిమిదిన్నరయింది. ఆ రోజు.

నాకోసం సుమన్ ఎదురు చూస్తున్నాడు.

స్థలాల సంగతి ఏమయినా తెల్సిందా ? అడిగాను.

"ఇంకా కనుక్కోలేదు.... సైనీ గురించి నేను వచ్చింది" చెప్పాడు.

"సైనీ ? ఏమిటి విశేషం" అడిగాను.

"ఇంతదాకా అది అన్నం తినలేదు. ఇతర ఏ ఆహారం తీసుకో లేదు." చెప్పాడు.

"మనం ఓ రోజు అన్నం లేకపోతేనే అల్లల్లాడిపోతాం. అంత చిన్న ప్రాణి ఇన్ని రోజులు అన్నం లేకుండా ఎలా వుంది ?" ఆశ్చర్యంగా అడిగాను.

"దానికి మాంసం ఇష్టమేమోనని ప్రయత్నించాం లాభం లేక పోయింది. రెండు రోజులుగా దానికి జ్వరం. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళి ఇంజెక్షన్ ఇప్పించాం. అది ఇదివరకటి యజమాని మీద బెంగ పెట్టుకుందని చెప్పాడు డాక్టర్. చచ్చిపోతుందని భయంగా వుంది. దాన్ని తిరిగి ఇచ్చేసి పుణ్యం కట్టుకోమని చెప్పడానికి వచ్చాను."

ఓ పుస్తకాలమ్మే అతను నాకిచ్చాడు దాన్ని రేపే ఆదివారం దాన్ని తీసుకురా ఇద్దరం కలసి వెళ్ళి అతనికి తిరిగి ఇచ్చేద్దాం" చెప్పాను.

మర్నాడు ఉదయం పదిన్నరకి మాయింటినుంచి ఆబిడ్స్ చేరు కొన్నాం.

పుస్తకాల దుకాణం యజమాని కొడుకు కూర్చుని వున్నాడు.

"మీ నాన్న ఏడీ ? అడిగాను.

"ఇవాళ రాలేదు వంట్లో బాగాలేదు." చెప్పాడు.

"ఈ కుక్క మీ దగ్గరకెలా వచ్చింది ?" అడిగాడు సుమన్.

"నా స్నేహితుడు బదిలీ అయి వెళుతూ దీన్ని నాకిచ్చాడు."

"ఏ వూరు బదిలీ అయ్యింది ?" అడిగాడు సుమన్.

వెంటనే తెల్లబోయాడు.

"ఎందుకు అడిగారు ? అడిగాడు.

"ఈ కుక్క మా దగ్గర వుంటే ఏం తినడంలేదు, చచ్చిపోయేలా వుంది. అర్జెంటుగా దీన్ని నీ స్నేహితుడికి చేర్చాలి."

"ఇంకా తినటం లేదా ?" అడిగాడు వాడు దాన్ని పరీక్షగా చూసి వెంటనే తనే సమాధానం చెప్పాడు. "అవును. బాగా చిక్కిపోయింది."

"నిజం చెప్పు ఇది నీ స్నేహితుడిచ్చింది కాదు కదూ" అడిగాడు. సుమన్. నాకు అదే అనుమానం కలిగింది అతని మొహం చూసి.

"నా స్నేహితుడిచ్చిందే" గొణిగాడు.

"అతని పేరేమిటి ?

"మస్తాన్ అలీ" బింకంగా చెప్పాడు.

"ఏం చేస్తాడు అలీ ?"

ఆ ప్రశ్నకి సమాధానం లేదు.

"నాకు తెలుసు నీకు ఈ కుక్కని ఎవరూ ఇవ్వలేదు. ఎవరి ఇంట్లోంచో దొంగతనం చేసావ్. అంతేనా ?" దబాయించాడు సుమన్.

"నిజం చెప్పు పర్వాలేదు. ముందర దీన్ని నీవు ఎవరింట్లోంచి తెచ్చావో అక్కడికి చేరిస్తేనే కాని బతకదు" బుజ్జగిస్తు అడిగాను.

అతడేమీ మాట్లాడలేదు.

"చెప్పకపోతే ఇది చస్తే మటుకు నిన్ను, నీ అయ్యని పోలీసులకు పట్టించి తీరుతాను" అరిచాడు సుమన్ కోపంగా.

"బషీర్‌బాగ్‌లో రోడ్డుమీద దొరికింది" చెప్పాడు తలవంచుకుని.

"ఎక్కడ ? ఏ రోడ్డుమీదో గుర్తుందా ?" తల వూపాడు బదులుగా.

"అయితే పద ఆ రోడ్డు చూపించు."

"దుకాణంమీద ఒక్కణ్నే వున్నాను"

"నీ పుస్తకాలెవరూ ఎత్తుకుపోరు. పక్కవాడికి చెప్పిరా" గదమాయించాడు సుమన్.

వాడు లేచి మా వెంట వచ్చాడు ఆటో పావుగంటలో అతను చూపించిన సందులో ఆగింది.

ఆటో దిగగానే షైనీ తోకాడించడం ఇద్దరం గమనించాం.

"ఏ ఇల్లు ?" అడిగాను. "తెలీదు."

షైనీకి కట్టివున్న గొలుసుని వదిలేసాం. నీరసంతో కదలలేని అదీ ఆనందంగా మొరుగుతూ పందడుగుల దూరం వున్న ఇంటివైపు శర వేగంతో పరిగెత్తింది. ఆ ఇంటి గేటు కిందనించి ఎంతో అలవాటయినట్లుగా దూరి ఇంట్లోకి వెళ్ళింది. మేము ఆ గేటువేపు అడుగులు వేశాం. ఆ ఇంటి ఖరీదు పదిలక్షలయినా చేస్తుంది.

దాదాపు ఆరేళ్ళ వయసు కలిగి, గులాబిరంగు గౌనులో వున్న ఓ పాప ఎక్కడనించో రివ్వున దూసుకువచ్చి షైనీని అమాంతంగా ఎత్తుకుని దాన్ని ముద్దు పెట్టుకుని గిరగిరా తిప్పసాగింది.

"హలో జిమ్మీ. వేర్ హేవ్ యూ బీన్ ?" షైనీతో మాట్లాడుతుంది ఆ పాప.

నీరసంగా వున్న ఆ పాప వెనకే ఇద్దరు కంగారుగా పరిగెత్తి కొచ్చారు. వారిద్దరూ ఆ పాప తల్లితండ్రులయి వుంటారని గ్రహించాను.

మమ్మీ జిమ్మీ హేజ్ కం బ్యాక్" చెప్పింది ఆ పాప. ఆ పాప మొహం ఆనందంతో వెలిగిపోతోంది.

"రామ్మా, లోపలికిరా. అసలే నీకు జ్వరం" జిమ్మీని ఎత్తుకున్న ఆ పాపని ఎత్తుకుంది తల్లి.

"ఇంకెక్కడి జ్వరం. దీనిమీద బెంగతో వచ్చింది కాబట్టి ఇక తగ్గిపోతుంది. డాక్టర్ చెప్పిందికూడా ఇదేగా." చెప్పాడు ఆ పాప తండ్రి.

జిమ్మీని నేలమీద వదలి ఆనందంగా గంతులేయసాగింది ఆ పాప.

వెనక్కి తిరిగాం ఆ సందు చివరిదాకా వచ్చాం. పుస్తకాల దుకాణం కుర్రాడు ఆగి ఓసారి వెనక్కి తిరిగి ఆ ఇంటివంక చూచాడు. తర్వాత మా ఇద్దరివంకా చూసాడు.

"చాలా చెడ్డపని చేసాను సార్. అతను కళ్ళతో చెప్పాడు.

(జయశ్రీ 1984)